సంపుటి: 4 | సంచిక: 6

సెప్టెంబర్ - అక్టోబర్, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రభువునందు ప్రియమైన స్పర్శ పాఠకులకు శుభములు.

ప్రభువైన మన దేవుడు జీవించవలసిన జీవితసత్యములను గూర్చి వాక్యముల ద్వారా నేర్పించుచున్నాడు గనుక మనము నెమ్మదిగా ఉన్నామని నేను భావిస్తున్నాను. లోకములో అనేకుల పరిస్థితులను చూచినప్పుడు వారి ఆశలు, అంచనాలు వాస్తవములకు దూరంగా ఉండడం వలన వారు జీవితం పట్ల ఎంతో నిరాశ చెందుతూ ఉన్నారు. మీరు మీ కుటుంబములు, జీవితం మీద ఆశలు, అంచనాలు కలిగి ఉండకూడదు అని నేను మీకు వ్రాయుటలేదు కాని వాస్తవములను జీర్ణించుకునే శక్తిని మనము కలిగి ఉండాలి. ఈ సందర్భములో పౌలు మనకు ఫిలిప్పీ పత్రిక ద్వారా సెలవిచ్చిన వాక్యభాగము ఎంతో ప్రయోజనకరము. **నాకు కొదువ కలిగినందున నేనీలాగు చెప్పుటలేదు; నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను. దీనస్థితిలో ఉండ నెరుగుదును, సంపన్న స్థితిలో ఉండనెరుగుదును; ప్రతివిషయములోను అన్ని కార్యములలోను కడుపు నిండియుండుటకును ఆకలిగొనియుండుటకును, సమృద్ధికలిగియుండుటకును లేమిలో ఉండుటకును నేర్చుకొనియున్నాను. - ఫిలిప్పీ 4 :11,12** తాను ఏ స్థితిలో ఉన్ననూ ఆ స్థితిలో సంతృప్తి కలిగి ఉండుట అనగా మనము ఒక మంచి గురి, కష్టపడే తత్త్వము కలిగి ఉండవచ్చు అయితే ఫలితం ఏదైనప్పటికి నిరాశలోనికి నెట్టబడి విలువైన జీవితకాలం వ్యర్థము చేసికొనకూడదు. సమాజములో అనేక మంది ఎంతో టాలెంట్ ఉన్నవారు కూడా ఇలాంటి ఉరిలో, ఉచ్చులోపడి విలువైన భవిష్యత్‌ని నాశనం చేసుకొనుచున్నారు. జీవిత ప్రయాణములో విజయము, ఘనత, సహాయము, లాభము ఎంత సాధారణమైనవో, ఓటమి, ఎదురుదెబ్బలు, నమ్మకద్రోహము, నష్టము, అవమానము, నిందలు కూడా అంతే సాధారణమైనవని గుర్తించాలి. జీవితం అనేది ఉంటే ఏదైనా సాధించవచ్చు కాబట్టి బ్రతుకుతూ కూడా జీవితం మీద విరక్తితో జీవచ్ఛవములవలె జీవించే జీవితమును విడిచి నీవు కలిగి ఉన్న జీవితమును బట్టి దేవునిని స్తుతించుచూ ముందుకు కొనసాగమని మనవి చేయుచున్నాను.

మీ సహోదరుడు.....



సంపుటి: 4 | సంచిక: 6

సెప్టెంబర్ - అక్టోబర్, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్వివమాస పత్రిక

## ఈ సంచికలో...


- నమ్మిక అనగా.... 2
- "ఆర్థిక శిక్షణ" 5
- గులాబి (స్త్రీల ప్రత్యేకం) 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 48వభాగము 9
- ది వైస్ కింగ్ (బాలల శీర్షిక) 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) 13
- వ్యాధులకు కారణములు 15
- ప్రార్థనా శక్తి 18
- కైలాస మహర్షి 20
- బైబిల్ క్విజ్-48 22
- జన్మదిన శుభాకాంక్షలు 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# నమ్మిక అనగా....

– బ్రదర్ శేఖర్



నమ్మిక (Trust) అనే పదం మనం చాలా ఎక్కువగా వాడుచూ ఉన్నా పరిశుద్ధ గ్రంథంలో దాని యొక్క ప్రాధాన్యత చాలా మందికి బోధపడదు. దేవుని యందు నమ్మిక ఉంచడం అంటే దేవుని యొక్క శక్తి, సామర్థ్యము, యోగ్యత, మంచితనము మీద స్థిరంగా ఆధారపడటం అని అర్థము. అనేక సంవత్సరాల క్రితం ఒక సాహసికుడు (Acrobat) నయాగరా జలపాతం దగ్గర ఒక తీగకట్టి ఈ వైపునుండి ఆవైపునకు నడవటానికి సిద్ధమయ్యాడు. అతను అంతకుముందు ప్రయత్నాలలో ఆ సాహసాన్ని విజయవంతంగా చేసియున్నాడు. కాబట్టి అక్కడ గుంపుకూడి ఉన్న ప్రజలు ఈసారి కూడా చేయగలడని కరతాళ ధ్వనులతో అతనిని ప్రోత్సాహ పరుస్తూ ఉన్నారు. వెయ్యి అడుగులు సాగే ఆ నడక ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా క్రింద 120 అడుగులు లోతులో ఉన్న జలపాతంలో పడి ప్రాణాలు కోల్పోవడం జరగవచ్చు. అక్కడ చూస్తూ ఉన్నవారంతా ఆ వ్యక్తి ఆ సాహసం చేయగలడని నమ్ముతున్నారు (Beleiving). సాహసం ప్రారంభించే ముందు ఆ వ్యక్తి అక్కడ చూస్తూ ఉన్నవాళ్ళతో ఇలా అన్నాడు. "నేను గతంలో ఈ సాహసాన్ని విజయవంతంగా చేశాను కాబట్టి ఈసారి క్రొత్త సాహసం చేయాలనుకుంటున్నాను. మీరంతా నా సామర్థ్యాన్ని నమ్ముతున్నారు కాబట్టి ఎవరైనా ఒకరు నాతో వస్తే నేను వారిని క్షేమంగా ఆదరికి చేరుస్తాను. ఒక్కరు కూడా ముందుకు రాలేదు కారణం మనందరం ఊహించగలం. వారిలో ఎవ్వరూ కూడా తమ ప్రాణాలను అతని చేతిలో పెట్టేంతగా అతన్ని నమ్మలేకపోతున్నారు (Unable to Trust in him). ఈలోగా ఒక బాలిక ముందుకు వచ్చి నేను సిద్ధమే అని చెప్పింది, అంతా ఆశ్చర్యపోతుండగా, తెలిసిన విషయం ఏమిటంటే ఆ బాలిక ఆ సాహసికుని కుమార్తె అని. ఆమెకు తన తండ్రి యొక్క సామర్థ్యం మీద పూర్తి నమ్మకం ఉంది. తన తండ్రి చేతులలో ఉంటే ఎక్కడ ఉన్నా, ఎటువంటి పరిస్థితులలో అయినా ఏ హాని జరగదని ఆమె యొక్క ప్రగాఢ నమ్మకం. సరిగ్గా ఇదే

నమ్మకమును మన పరలోకపు తండ్రి నీనుండి, నానుండి కోరుకుంటున్నాడు.

ఒక వ్యక్తి తన జీవితమును దేవుని చేతిలో పెట్టి ఆయన మీదే నమ్మిక యుంచినప్పుడు ఆ వ్యక్తి జీవితం దేవుని యొక్క విశిష్ట ప్రణాళికలో అద్భుతంగా వర్ధిల్లుతుంది. చాలా మంది తమ జీవితాన్ని దేవుని కంటే తామే బాగా తీర్చిదిద్దుకోగలమని, స్వంత నిర్ణయాలను తీసుకొని వాటిలో జయం కోసం ప్రార్థిస్తూ ఉంటారు. వీరు దేవుని మీద నమ్మిక యుంచినవారుగా దేవుని యొక్క వాక్యం ఒప్పుకొనదు. "నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము నీవు ఆయనను నమ్ముకొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును" కీర్తన 37:5. తమ మార్గములను దేవునికి అప్పగించుకొనిన (Committed) జీవితాలను ఆయన అనూహ్యముగా ఫలింపచేస్తాడు. గొఱ్ఱెల కాపరిగా ఉన్నప్పుడే దావీదు తన మార్గమును దేవునికి అప్పగించుకున్నాడు. దేవుని యందు పూర్ణహృదయంతో నమ్మిక యుంచాడు. కాబట్టి దేవుడు ఇశ్రాయేలీయులకు రాజుగా అభిషేకించాడు. ధనబలాన్ని, కండబలాన్ని, విద్యాబలాన్ని కాక కేవలం దేవుని మీదే నమ్మిక యుంచడం అనుకున్నంత సులభమైన పని కాదు. ఇది శరీరానికి ఏమాత్రం నచ్చని, బాధాకరమైన పద్ధతి. దేవునియందే నమ్మికయుంచడం అంటే నీకు ఏమీ చేతకాదు, నువ్వు చచ్చావు అని శరీరంతో చెప్పడం. ఆత్మవిశ్వాసమే విజయరహస్యం అని నమ్మే ఈ లోకానికి దేవుని మీద నమ్మికయుంచడం అనేది అవివేకముగాను, ఆత్మనూన్యతాభావము (Inferiority Complex) గాను కనబడుట సహజమే.

మన జీవితములో ప్రతిదానికి ఆయన మీద ఆధారపడి, పూర్తిగా ఆయన యందు నమ్మిక యుంచాలని మన నుండి ఆయన ఆశిస్తున్నారు. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవా యందు నమ్మికయుంచుము" సామెతలు 3:5. స్వబుద్ధి అంటే అవగాహన లేదా తెలివి (Understanding). మన తెలివి ఎప్పుడూ మనుష్యుల మీద, డబ్బు మీద, బంధువులు, స్నేహితుల మీద, సౌందర్యము, సామర్థ్యము మీద ఆధారపడమని చెప్తుంది. సాధారణంగా నమ్మికయుంచడం (Trusting) అంటే దేవుని నమ్మటం (Beleiving) అని అనుకుంటూ ఉంటాం, కాని అది సరికాదు. దేవుని యందు విశ్వాసముంచినవారు రక్షించబడి విశ్వాసులుగా (Believers) మార్పు చెందినప్పటికి వారిలో చాలా కొద్దిమందే పూర్ణహృదయంతో దేవుని యందు నమ్మికయుంచుచూ జీవించేవారిగా ఉంటున్నారు. ఇలా జీవించేవారు దేవుని సంఘాలలో 10 నుండి 20 శాతం మాత్రమే ఉంటారనుటలో అతిశయోక్తిలేదు.

నీ జీవితమును ప్రభువైన యేసుక్రీస్తు ఫలింపచేసినట్లుగా ఈ లోకంలో ఉన్న ఏ ఒక్కరూ చేయలేరు. దేవుని యందు నమ్మికయుంచడం ఎంత పరిమాణంలో ఉంటే నీ ఆత్మీయజీవితం కూడా అంతే పరిమాణంలో ఉంటుంది. దేవుని వాక్యాన్ని చదవడం, వినడం, ధ్యానించటం ద్వారా ఆయనను ఎక్కువగా తెలుసుకొనవచ్చు. ప్రార్థనలో ఆయనతో గడుపుట

ద్వారా ఆయనతో మన సహవాసమును పెంచుకొనవచ్చు. అయితే మనకు ఆయన మీద నమ్మకం పెరిగేది మాత్రం ఆయన చేతిలో చేయి వేసి జీవితసమస్యల గుండా ప్రతిదినము ఆయనతో నడిచినప్పుడు మాత్రమే, దేవుని వాక్యం వినుటవలన విశ్వాసం కలుగుతుంది. అయితే ఆ విశ్వాసం యొక్క నిజజీవిత ప్రయోగమే దేవుని యందు నమ్మికయుంచడం. విశ్వాసులైన భార్యా, భర్త ఒక దినాన ఓడలో సముద్ర ప్రయాణం చేస్తున్నారు. భర్త ఒక సైన్యంలో అధికారిగా ఉంటూ ఉన్నాడు. ఈలోగా సముద్ర తుఫాను ప్రారంభమైనది. తుఫాను తీవ్రరూపం దాల్చడంతో ఆ భార్య చాలా భయానికి లోనై కలవరపడుతూ ఉంది. భర్త భార్యను సముదాయించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పుడు భర్త తన తుపాకీ తీసి ఆమె గుండెకు గురిపెట్టాడు. భయపడుతూ ఉన్నావా అని అడిగాడు ఆమెను చూచి. అందుకు ఆమె, అసలు భయమే లేదు ఎందుకంటే ఎంతో ఎక్కువగా ప్రేమిస్తున్న నీవు నన్ను గాయపర్చలేవు అన్నది. అందుకు భర్త, “ఈ గాలి, నీరు కూడా నిన్ను, నన్ను అత్యధికంగా ప్రేమిస్తున్న దేవుని చేతిలో ఉన్నాయి. అవి భయంకరంగా ఉన్నా ఆయన వాటిని మనకు హానిచేయనివ్వడు” అని అన్నాడు. విశ్వాసమనేది దేవుని యందు నమ్మికయుంచడంగా మారనంతవరకు దాని యొక్క నిజమైన ప్రయోజనాన్ని మనం పొందుకొనలేము.

ప్రియ చదువరీ ! నీ జీవితము యొక్క శ్రేయస్సు కోరేవాడు, ప్రతిక్షణం నీ జీవితాన్ని సురక్షితంగా కాపాడేవాడు ప్రభువైన యేసుక్రీస్తు మాత్రమే. కాబట్టి ఆయన చేతులకు మన జీవితాన్ని అప్పగించుటకు సందేహింపక, తండ్రియైన దేవుని యందు నమ్మిక యుంచి ఆయన ప్రణాళికలో వర్ధిల్లుచూ, మన తండ్రి ఎంతో నమ్మదగిన వాడని మన జీవితాల ద్వారా లోకమునకు చూపించెదము.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

*అందరూ ఆహ్వానితులే....!*

**వివరములకు:**
9666666249 | 040-24202227


 **ఓటమిలేనివాడికి అనుభవం రాదు. అనుభవం లేనివాడికి జ్ఞానం రాదు.**

# "ఆర్థిక శిక్షణ"

దేవుని ఎరిగి ఆయన మార్గములో నడుచుచున్నామనుకునే వారి జీవితములలో ఆర్థిక క్రమశిక్షణ లేక దేవుని నామమునకు అవమానము కలిగించు వారిగా జీవించుచున్నారు. తమకు దేవుడు ఇచ్చినంతలోనే తమ ఖర్చులు ఉండాలి అనే అవగాహన కూడా లేకపోవడం చాలా దురదృష్టకరం. అవకాశం ఉన్న ప్రతి స్థలములో అప్పులు చేసుకుంటూ బ్రతుకుతూ ఉంటారు. ఇలాంటి వారు ఎక్కువమంది నెల నెల వచ్చే జీతముతో కూడిన ఉద్యోగముల పట్ల ఆసక్తి కనపరచకపోవడం మనకి కనిపిస్తుంది. వారు వ్యాపారం మాకు ఇంట్రెస్ట్ అని చెప్పుకుంటూ అప్పులు చేయడానికి సులువుగా ఉండే దారులలో ప్రయాణిస్తూ ఉంటారు. వ్యాపారం అనే దానిలో పెట్టుబడి, లాభం అనేవి ఉంటాయని, లాభం మాత్రమే మనకు వచ్చే ప్రతిఫలం అని కూడా అర్థం కాకుండా పెట్టుబడిని కూడా ఖర్చుపెట్టి చివరికి దివాలా తీసేవారిగా ఉంటున్నారు. దేవుని స్వర్శ పాఠకులైన ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని కోరుకొనుచున్నాను. ఈ విషయములో ఉన్నదానితో సరిపెట్టుకొనుకొనుట చాలా ముఖ్యం. అట్టహాసములు, ఆర్భాటములు చేసుకుంటూ ప్రతి దానికి ఇతరులతో పోల్చుకుంటూ, స్థితికి మించిన ఖర్చులు చేసుకుంటూ ఉండడం ఎంతో ప్రమాదకరం. బర్త్‌డేస్, మెచ్యూర్ ఫంక్షన్స్, మ్యారేజస్ లాంటి విషయములలో ఆర్థిక క్రమశిక్షణలో పూర్తిగా అదుపు తప్పి ప్రవర్తించటం ద్వారా కేవలం వారు మాత్రమే కాక వారి తరువాత వచ్చే తరముల వారి మీద కూడ భారములు మోపుచున్నారు. ఇది ఎంతో భయంకరం. దాని పర్యవసానాలు జీవితాలను నాశనం చేస్తుంటాయి కనుక ఆర్థిక విషయాలు అనగా డబ్బులు ఉపయోగించే విషయాలలో ఎంతో జ్ఞానముతో వ్యవహరించి రాబోవు నాశనం నుండి తప్పించబడదాము. తద్వారా దేవుని నామమునకు మహిమకరంగా జీవించుదాము.





# గులాబి

– సిస్టర్ వి.విజయ

ఒక అడవిలో అనేక రకములైన మొక్కలు, చెట్లు పెరుగుచూ ఉండేవి. వీటన్నిటి మధ్యలో ఒక ఎర్ర గులాబి మొక్క కూడా పెరుగుచూ, పువ్వులతో అందంగా కనబడుచూ ఉండేది. ఈ పువ్వులను చూచిన దేవదారు వృక్షము ఒకరోజు అబ్బా! ఎంత అందముగా ఉన్నాయి, నేను కూడా వీటి వలె ఉంటే ఎంత బాగుండు అని తన ప్రక్కన ఉన్న మొక్కలతో, చెట్లతో చెప్పింది. వెంటనే మరియొక చెట్టు ప్రియమైన దేవదారు మిత్రమా! నీవు అందంగా లేవు అని విచారపడవద్దు, అందరూ అన్నిటిని కలిగి ఉండలేరు అని చెప్పింది. అంతలో గులాబీ పువ్వు దాని తలను పైకెత్తి, గర్వంగా చుట్టూ కలయచూస్తూ, ఈ అడవి అంతటిలో అందమైన మొక్కని నేనే, ఏదీ లేదు అని చెప్పింది. అంతలో సన్‌ఫ్లవర్ మొక్క దాని తలను పైకెత్తి "నువ్వే అందమైనదానవని నీతో ఎవరు చెప్పారు?" ఈ అడవిలో అందమైన మొక్కలు ఇంకా చాలా ఉన్నాయి వాటిలో నువ్వు ఒక దానివి మాత్రమే అని చెప్పింది. అందుకు గులాబి పువ్వు నన్ను ప్రతి ఒక్కరూ చాలా ఇష్టముగా, ఎంతో ఆసక్తితో గమనిస్తూ ఉంటారు అని తనను తాను గొప్ప చేసుకుంటూ ప్రక్కనే ఉన్న ముండ్ల చెట్టుని చూపిస్తూ, ఈ మొక్కను చూడండి ముండ్లతో ఎంత అందవికారముగా ఉందో, నేను ఈ విధంగా లేను అని ముఖమును వికారముగా చేసుకొని అంది. వెంటనే దేవదారు వృక్షము ఓయీ ఎర్రగులాబి! నువ్వు ఏమి మాట్లాడుచున్నావు? నిజమైన అందము అనగా ఏమిటో నీకు తెలుసా? ఎవరు చెప్పగలరు? నీకు కూడా ముళ్ళు ఉన్నాయి చూసుకో! అని గులాబీకి బుద్ధి చెప్పటానికి ప్రయత్నించింది. అప్పుడు ఎర్రగులాబి కోపంగా దేవదారు చెట్టు వైపు చూస్తూ, "నీకు చాలా మంచి అభిరుచి ఉంది" అని తలంచాను కానీ, అందమంటే ఏమిటో నీకు అస్సలు తెలియకపోగా నన్ను కూడా ఈ అందవిహీనమైన ముండ్ల చెట్టుతో పోల్చుతావా? నీకు ఏమైనా బుద్ధి ఉందా? నేనెక్కడ? ఇదెక్కడ ? అని కోపంతో మిటమిటలాడింది.

ఎర్రగులాబి మాటలన్నీ విన్న మిగిలిన మొక్కలు, చెట్లు అన్నీ కూడా దీనికి ఎంత అహంకారము అనుకున్నాయి. ఈ సంభాషణ జరిగిన తరువాత ఎర్రగులాబి మొక్క, ముండ్ల చెట్టు ప్రక్క నుండి ఏ విధముగానైననూ వెళ్ళిపోవాలని ప్రయత్నించి, వేర్లు భూమిలో బలముగా ఉండుట ద్వారా సాధ్యం కాక ప్రయత్నించుట మానివేసింది. ఈ విధంగా దినములు గడుస్తున్న కొలది, గులాబి మొక్క ముండ్లచెట్టుని కించపరుస్తూ, అవమానకరంగా ఇది ఎందుకూ పనికి రాదు, దీని ప్రక్కన నివసించటం నాకు అవమానకరం అని తలంచి మాటలతో హృదయమును గాయపరచుట ప్రారంభించింది. ఇవన్నీ వింటూ, ప్రక్కనే ఉన్న ముండ్ల చెట్టు మాత్రము ఏమీ కలవరపడక, కృంగిపోక నిబ్బరముతో "ఒక ఉద్దేశ్యము

లేకుండా దేవుడు ఏ ఒక్కరినీ సృష్టించరు", ప్రతి ఒక్కరి పట్ల ఆయన ఒక ఉద్ధేశ్యమును కలిగి ఉంటారు అని ఎర్రగులాబికి నచ్చచెప్పటానికి ప్రయత్నించేది.

వసంతకాలం ముగిసి, వాతావరణంలో మార్పులు జరిగి, వేసవి కాలం ప్రారంభమయ్యే దశలో అడవిలో మొక్కల, జంతువుల జీవన విధానమునకు చాలా క్లిష్టమైన పరిస్థితులు వాటిల్లి, నీరు ఎంతగానో అవసరమైన పరిస్థితులలో నీరు లేక ఎర్రగులాబి వాడిపోవుట ప్రారంభమయ్యింది. ఒకరోజు కొన్ని పిచ్చుకలు తన ప్రక్కనే ఉన్న ముండ్ల చెట్టుని ముక్కులతో పొడిచి, సేద తీర్చుకొని ఎగిరిపోవుట ఎర్రగులాబి గమనించింది. దానికి ఆ పిచ్చుకలు చేస్తున్నది ఏమిటో అర్థముకాక, అవి ఏం చేస్తున్నాయి? అని దేవదారు వృక్షమును ప్రశ్నించింది. ఆ పక్షులు ముండ్ల చెట్టు నుండి తమకు అవసరమైన నీటిని తీసుకుంటున్నాయి అని బదులిచ్చింది. పక్షులు ఆ విధంగా పొడిచి, రంధ్రములు చేయుచున్నప్పుడు దానికి బాధగా ఉండదా? అని తిరిగి ప్రశ్నించింది గులాబి. అది చాలా బాధను కలిగించే పరిస్థితే అయినప్పటికి పక్షులు నీరు లేక బాధపడుతూ, చనిపోతుంటే ముండ్ల చెట్టుకి ఇష్టముండదు. తాను బాధని, నొప్పిని ఓర్చుకొని, తనలో ఉన్న నీటిని వాటికి అందిస్తూ ఉంటుంది ప్రతి వేసవిలోనూ ఈ విధముగా జరుగుచూ ఉంటుంది అని దేవదారు వృక్షం సమాధానమివ్వగానే ఎర్రగులాబి కన్నులు తెరుచుకొని, దానిలో నీరు ఉందా ? అని అనుమానమును వ్యక్తపరిచింది. అవును, అది నీటిని కలిగి ఉంటుంది, నీకు కూడా నీరు అవసరమైన పరిస్థితులలో దాని నీటిని త్రాగవచ్చు, ముండ్ల చెట్టుది ఎల్లప్పుడూ సహాయం చేయాలనే మనస్సు, కనుక నువ్వు తప్పక దాని సహాయం కోరితే, పక్షులతో చెప్పి ఆ నీటిని నీకు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తుంది అని చెప్పింది దేవదారు వృక్షము.

ఎర్రగులాబి ముండ్లచెట్టుని సహాయం చేయమని అడగటానికి, తాను గతంలో ఆ చెట్టు పట్ల ప్రవర్తించిన తీరు, అహంకారంగా మాట్లాడిన మాటలు, దాని పొరుగుదానిగా ఉండకూడదని చేసిన ప్రయత్నములు అన్నీ గుర్తుకు వచ్చి సిగ్గుపడుచూ, తల వంచుకొని క్షమించమని వేడుకుంటూ, ఎట్టకేలకు సహాయం చేయమని కోరింది. అప్పుడు ముండ్లచెట్టు నేను అందవిహీనమైనదానిని కదా ! అనే మాటలతో తిరిగి గులాబి మొక్కను హింసించాలని ప్రయత్నించక, కనికరముతో ఒప్పుకొని పక్షులు నీటికోసం వచ్చినప్పుడు, వాటికి చెప్పి వాటి ద్వారా గులాబి మొక్కకు నీటిని ఇప్పించగలిగింది. ఆ నీటిని స్వీకరించి ఎంతో సేదను పొందింది గులాబిమొక్క. తరువాత క్షణం నుండి రూపమును బట్టి ఎవరికీ తీర్పుతీర్చకూడదు అనే పాఠమును ముండ్ల చెట్టు నుండి నేర్చుకోగలిగింది ఎర్రగులాబి.

ఈ సంఘటనలో ఎర్రగులాబి తన యొక్క అందము కలిగిన రూపమును బట్టి తనని తాను హెచ్చించుకుంటూ, ముండ్ల చెట్టు యొక్క ఆకారమును బట్టి ఏ విధంగా మాటల

ద్వారా కించపరచిందో మనము గమనించాము. ఇది ఎంత అన్యాయము, మంచిది కాదు అని అనుకుంటున్నాము కానీ మనం కూడా సమాజములో రక రకములైన మనుష్యుల మధ్య జీవిస్తూ ఉంటాము. మనము ఉన్న స్థాయిని బట్టి, మనకి ఉన్న అర్హతలతోను, ఆర్థిక, ఆత్మీయసంబంధమైన పరిస్థితులతోను ఎదుటి వారిని పోల్చుకుంటూ, నాకు అన్నీ మంచి లక్షణములు, మంచి స్వభావము ఉన్నది అని మనల్ని మనము హెచ్చించుకుంటూ, వారిలో ఉన్న లోపములను ఎత్తి చూపించి, మాటలు, ఆలోచనలు క్రియల ద్వారా కించపరిచే వారిగా ఉంటున్నామన్నది వాస్తవమైన విషయము.

బైబిల్ గ్రంథములో అబ్రాము, శారాయి అనే భార్యాభర్తలున్నారు. వారికి పిల్లలు కలుగలేదు, శారాయికి హాగరు అనే దాసి ఉండేది. ఒకరోజు శారా తన భర్తతో దయచేసి నా దాసి వలన పిల్లల్ని కనమని అబ్రాముని అడిగింది. అబ్రాము ఒప్పుకున్నాడు. హాగరు అబ్రాము వలన గర్భవతియైనది. తాను గర్భవతినని హాగరు తెలుసుకున్నప్పుడు శారాయిని నీచముగా చూడటం జరిగింది. కేవలం సంతానం లేదు అనే విషయమును బట్టి తన పైనున్న యజమానురాలు అని కూడా లేకుండా శారాయిని పనికిరానిదానిగా చూడటం ప్రారంభించింది. ఈ రకమైన మనస్తత్వం ఉండుట మంచిది కాదు.

కాబట్టి ప్రియమైన వారలారా ! దేవుడు సృష్ఠిలో ప్రతి ఒక్కరి పట్ల ఒక్కొక్క ఉద్దేశ్యమును కలిగి ఉన్నారు. ఈ లోకంలో ఎవరిదీ వ్యర్థమైన జీవితం కాదు, ఎవరికి వారే వేరు వేరు మనస్తత్వములు గలవారు, ఏ ఇద్దరూ ఒకే విధంగా ఉండలేరు, ఎవరికి వారే ప్రత్యేకత గలవారు. మనలో అన్నీ మంచి లక్షణములు ఉండి, ఒక్కటే లోపం ఉన్నప్పుడు అది లోపంగా అనిపించదు కానీ, ఎదుటి వారిలో ఉన్న ఒక్క లోపమే ఎంతో పెద్దదిగా మన కళ్ళకి కనిపిస్తుంది. కాబట్టి ఏ విషయములోనూ మనల్ని మనము హెచ్చించుకొని, ఎదుటివారిలో లోపములను మాత్రమే చూడక, మనల్ని మనం తగ్గించుకున్నప్పుడు ఎదుటి వారిలోని మంచి లక్షణములు మనకి కనబడతాయి. కనుక మనల్ని మనం తగ్గించుకొని, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును అన్న దేవుని వాగ్దానము యొక్క నెరవేర్పును చూద్దాము. అట్టి కృప దేవుడు మనకి అనుగ్రహించును గాక !

 వేలకొద్ది నీతులు బోధించే కన్నా ఒక్క మంచి పని ఆచరించి చూపు.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 48వ భాగము**

దక్షిణాదికి వచ్చిన తరువాత పార్కర్ దంపతులతో గాఢస్నేహాన్ని అలవర్చుకోవడమే గాక దివాన్ బహదూర్, ఎ.ఎస్. అప్పాస్వామి గారు అంతకు ముందు హిందువుగా ఉన్న ఒక లాయరు ఎంతో విస్తృతంగాను, శక్తివంతంగాను సేవచేస్తున్న ఈ యౌవన సాధువుని కలుసుకోవాలని తహతహలాడారు. ఎడతెరిపిలేని కూటములతో అలసిపోయిన సుందర్‌కు కొంచెం విశ్రాంతి అవసరమని బిషప్ అప్పాస్వామిగారు భావించి కొండల ప్రాంతంలోని తన గృహమునకు సుందర్‌ని ఆహ్వానించాడు. ప్రశాంతంగాను, ఎన్నెన్నో వృక్షములతో నిండిన దట్టమైన అరణ్యములలో ప్రశాంతమైన సెలయేళ్ళను చూస్తూ కిలకిలరావాలతో ఎగిరే పక్షులను చూచుకుంటూ తృప్తిగా గడపాలనే చిరకాల వాంఛ ఈ ప్రాంతంలో తీరినట్లయ్యింది సుందర్‌కు. ఎంతో కృతజ్ఞతాభావముతో ఈ ఆహ్వానాన్ని అంగీకరించాడు సుందర్. దక్షిణాది ఎండలకు, చెమటకు ఆయన తట్టుకోలేకపోయాడు. “ఉప్పు కరిగినట్లుగా కరిగి పోవుచున్నట్లుంది నా పని. అయిననూ దక్షిణాదిభారతదేశం ఉప్పుసారం పొందితే అలా ఉప్పులా కరిగిపోవడం నాకు ఇష్టమే” అని ఉత్తరాదిలో ఉన్న తన స్నేహితుడు ఒకనికి ఉత్తరములో పేర్కొన్నాడు సుందర్. ప్రస్తుతం తాను వచ్చిన ఈ కొండలలోని చల్లని వాతావరణం అతనికి ఎంతో ఉపశమనాన్నిచ్చింది. అంతేకాక ఇంగ్లీష్ నేర్చుకోవడానికి కూడా మంచి అవకాశం దొరికింది. దక్షణాది ప్రజలు ఆంగ్లములో మాట్లాడడం దానిని చక్కగా అర్ధం చేసుకోవడం చూచిన సుందర్‌కి ఈ భాష నేర్చుకోవడం లాభదాయకమని ఇట్టే అర్ధమైపోయింది. అంతేగాక ఆంగ్లములో మాట్లాడితే అన్ని కూటములలో తర్జుమా చేయాల్సిన అవసరం కూడా ఉండదు. తర్జుమా చేసే వారందరు విన్సెంట్ డేవిడ్‌లా చేయలేకపోయారు. వారిలో కొందరిని తర్జుమా చేసే వారనటం కంటే కూడా ప్రసంగానికి అంతరాయం కలిగించే వారంటేనే బాగుంటుందని సుందర్ అనేవాడు.

ఈ దినములను సుందర్ ఎంతో సంతోషంగా గడిపాడు. సుందర్ సౌకర్యంగా ఉండడానికి అప్పాస్వామి గారి కుటుంబం చేయగలిగినదంతా చేసింది. భోజనములో ఏదైనా మార్చాలా అని సుందర్‌ని అడిగినా ప్రయోజనము ఉండేది కాదు, నాకది కావాలి, నాకిది కావాలి అని ఏమీ అడిగేవాడు కాదు సుందర్. వడ్డించిన దానిని సంతోషంగా ఆరగించేవాడు. అయితే కాఫీ, టీల కంటే పాలు త్రాగడమే ఇష్టమని అది కూడా వేడి వేడిగా ఉంటేనే ఇష్టపడతాడని తెలుసుకోవడానికి వారు ఎంతో కష్టపడవలసి వచ్చింది. రుచి సంగతి ఎలా ఉన్నా వేడి వేడిగా ఉంటే చాలు సంతోషంతో త్రాగేవాడు సుందర్.

తరచుగా కాలువల్లోనే స్నానం చేసేవాడు సుందర్. ముందుగా బట్టలు ఉదుకుకొని ఏ కంచె మీదనో ఆరవేసికొనేవాడు. ఆ తరువాత స్నానం చేసి ఒంటికి నూనె వ్రాసుకునేవాడు. తెల్లగా ఉండే ఆయన శరీరం ఈ నూనె వ్రాసిన తరువాత పసిడిముద్దలా ప్రకాశిస్తుండేదని సుందర్‌తో పాటే ఆ గదిలో ఉండిన అప్పాస్వామి గారి కుమారుడు చెప్పారు. అంతేకాక సుందర్ తన తలపాగాను ఎంతో జాగ్రత్తగా చుట్టుకునేవారు. ఆయన తలపాగా పదిగజాల పొడవు ఉండేది. సుందర్ తన తలపాగా చుట్టుకునే విధానాన్ని పరికించి చూస్తే సిక్కులలో అతడెంతో ఉన్నత వర్గానికి చెందిన వాడని చెప్పకనే చెప్పినట్లువుతుంది. రాంపూర్‌లో సిక్కుల ఆవరణలో తాను నేర్చుకొన్న పరిశుభ్రమైన అలవాట్లను సుందర్ ఎన్నడు మర్చిపోలేదు. అప్పాస్వామిగారి గృహంలో ఆరువారాలు ఆ విధంగా నుండి ఆయనతో ఎన్నో విషయాలు చర్చించడమే గాక ఆంగ్ల భాష కూడ నేర్చుకున్నారు. అప్పాస్వామి గారి గృహములో ఆరువారములు ఈ విధంగా ఉండి, ఆయనతో ఎన్నో విషయములు చర్చించడమే గాక ఆంగ్లభాష కూడా నేర్చుకున్నారు.

క్రైస్తవ కార్యకలాపములలోను, ప్రార్థనలలోను గడపాలన్న ధ్యేయముతో అప్పాస్వామి గారు కొంచెము ముందుగానే తన వృత్తికి రాజీనామా చేశారు. తన దేశమునకు సువార్త అందించాలని ఎంతగానో ఆశించిన ఆసక్తిపరుడు అప్పాస్వామిగారు. సుందర్ జీవిత విధానమును, ఆయన బోధనా సరళిని చూచిన తరువాత తన కోరిక నెరవేరే మార్గం దొరికిందని పరవశించిపోయాడు. యే క్రైస్తవ సంఘంగాని, మిషన్‌గాని చేసే దానంతటి కంటె సుందర్ జీవిత విధానము, ఆయన బోధలు భారతీయ హృదయములను కదిలించేవిగా ఉన్నాయని అప్పాస్వామికి ఋజువైపోయింది. అయితే భారతదేశమునకు సువార్తని అందించాలంటే ఒకరి వలన జరిగే పని కాదు. ఇలాంటి సుందర్‌లు మరెందరో కావాలి. ఆ సమయములో తన మనస్సులో రూపుదిద్దుకొంటున్న ప్రతిపాదనను సుందర్ ముందు ఉంచారు అప్పాస్వామిగారు. ఈ ప్రతిపాదనకు సుందర్ అంగీకరిస్తే సుందర్‌లాగానే సేవచేయడం కోసం క్రైస్తవసాధువులను తర్ఫీదు చేసేందుకుగాను ఒక కేంద్రమును స్థాపించాలి. దీనివలన మరెందరో సాధుసుందర్ సింగ్‌లు లేచి సుందర్ ప్రకటించాలని ఆకాంక్షిస్తున్న సువార్తను ఎన్నో లక్షలాది మందికి వినిపిస్తారు. మరి ఎందరో ఇతరులు కూడా ఇదే మాటను సుందర్‌తో ఎన్నోసార్లు చెప్పారు. ఈ ప్రతిపాదన ఎంతో సమంజసంగా కనిపిస్తున్నప్పటికిని తన విషయములో అది దేవుని చిత్తమని ఆయన భావించలేకపోయారు. తాను మాత్రం సర్వసంగ పరిత్యాగిగా సామాన్యమైన సాధువుగా క్రీస్తును ప్రకటించాలన్న ధ్యేయముతో ముందుకు సాగాడు.

(ఇంకా ఉంది)

సేకరించబడింది.

 తీసుకోగలిగిన దానికంటే తక్కువ తీసుకోవటం గౌరవం.



# "ది వైస్ కింగ్"

బాగున్నారా పిల్లలు! మీ ఆరోగ్యం ఎలా ఉంది? ఇప్పుడు ఎక్కడ చూసినా జ్వరాలు, ఇన్‌ఫెక్షన్స్ తో చాలామంది సఫర్ అవుతున్నారు. జాగ్రత్తగా ఉండండి పిల్లలూ... మీ పేరెంట్స్ చెప్పినట్లు వినండి. టైంకి మంచి ఫుడ్ తీసుకోండి. ఇంకా... పరిశుభ్రంగా ఉండటం చాలా Important. అలా ఉండకపోతే అనేక రోగాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు.

ఎలా చదువుతున్నారు? మీరు బాగా చదువుకొని ప్రయోజకులు అవ్వాలని మీ పేరెంట్స్ ఆశ. జ్ఞానం కలిగి ఉంటే అందరికీ ఉపయోగపడగలము. ఉదాహరణకి సొలొమోను జ్ఞానాన్ని చూడండి. నేటికీ "The Wise King of Solmon అని చెప్పుకుంటూ ఉంటాము కదా! సొలొమోను దావీదు కుమారుడు. దావీదు దేవుని యందు భయభక్తులను, ఎంతో ప్రేమను కలిగి ఉండేవాడు. సొలొమోను కూడా తండ్రివలెనే దేవుని యందు భయభక్తులు కలిగి ఉండేవాడు. సొలొమోను కింగ్ అయిన తరువాత ఒకరోజు దేవుడు ప్రత్యక్షమై నీకేమి కావాలి అని అడిగాడు. అప్పుడు సొలొమోను "నీ ప్రజలను పరిపాలించుటకు నాకు జ్ఞానవివేకములు ఇవ్వమని అడుగుతాడు. అప్పుడు దేవుడు నువ్వు బంగారము ఐశ్వర్యము కాకుండా, జ్ఞాన వివేకములు అడిగావు కనుక ఐశ్వర్యము కూడా నీకు ఇస్తున్నాను అని అన్నింటిని అనుగ్రహించాడు. సొలొమోను యొక్క జ్ఞానమునకు ఒక ఉదాహరణ ని మనం చూద్దామా !

ఇద్దరు మదర్స్ ఒక బేబిని పట్టుకొని 'ఇది నా బిడ్డ', 'ఇది నా బిడ్డ' అని గొడవ పడుతూ న్యాయం చేయమని సాల్మన్ కింగ్ దగ్గరకు వెళ్ళారు. వాళ్ళిద్దరూ ఈవిధంగా చెప్పటం మొదలు పెట్టారు.  నేను ఈమె ఒకే ఇంటిలో నివసించుచున్నాము. నేను ఒక పిల్లను కన్నాను, మూడు రోజుల తర్వాత ఈమె కూడ ఒక పిల్లను కనెను. మేము తప్ప ఆ ఇంటిలో ఇంకెవరూ ఉండరు. ఒకరోజు రాత్రి పడకమీద ఈమె తన బిడ్డ మీద పడగా అది చనిపోయెను. కాబట్టి మధ్య రాత్రి ఆమె లేచి నేను నిద్రించుచుండగా వచ్చి, నా ప్రక్కలో నుండి నా బిడ్డను తీసుకొని తన పడక మీద వేసుకుని, చనిపోయిన తన పిల్లను నా ప్రక్కలో ఉంచెను. ఉదయమున నేను లేచి నా పిల్లకు పాలియ్య చూడగా అది చనిపోయి ఉండెను.

తరువాత నేను పిల్లను నిదానించి చూడగా అది నాకు పుట్టినది కాదని తెలిసికొంటిని.

అంతలో రెండవ మదర్ – అదేమి కాదు “బ్రదికియున్నది నా బిడ్డ చనిపోయినది ఆమె బిడ్డ” అని చెప్పెను. ఇలా ఇద్దరూ రాజు ముందు “బ్రతికియున్నది నా బిడ్డ చచ్చినది నీ బిడ్డ” అని వాదించుకుంటూ ఉంటే అక్కడ ఉన్న ప్రజలంతా ఈ సమస్యకు పరిష్కారం రాజు ఏం చెప్తాడో అని ఇంట్రెస్ట్‌గా చూస్తున్నారు. రాజు కత్తి తెమ్మని ఆజ్ఞాపించెను. అందరూ ఆశ్చర్యంగా ఇది ఏమైనా కూరగాయా, పండా, బన్నా కత్తితో పంచి చెరిసగం చేసివ్వటానికి? అనవసరంగా బ్రతికి ఉన్న పిల్లను కూడా రాజు చంపేస్తున్నాడు అని తలంచారు.

అంతలో రాజు – బ్రతికియున్న ఈ బిడ్డను రెండు భాగములు చేసి చెరిసగము ఇయ్యవలసినదిగా ఆజ్ఞాపించెను” వెంటనే ఆ బిడ్డ తల్లి ఎంతో బాధతో రాజా! – “బిడ్డను ఎంత మాత్రము చంపక దానికే యిప్పించుమని మనవి చేయగా, ఆ రెండవ స్త్రీ “అది నాదైనను దానిదైనను కాకుండ చెరిసగము చేయమనెను”. అందుకు రాజు – బ్రతికియున్న బిడ్డను చంపక మొదటిదానికియ్యుడి, “దాని తల్లి ఆమె” అని తీర్పు తీర్చెను. అప్పుడు ఆ తల్లి బహుగా సంతోషించి రాజుకి కృతజ్ఞతలు చెప్పెను. ప్రజలంతా విస్మయంతో రాజు జ్ఞానంగా ప్రవర్తించాడని, దైవజ్ఞానం పొందినవాడని గ్రహించి అతనికి భయపడిరి.

చూశారా పిల్లలూ! సాల్మన్ కింగ్ దేవుడు ఇచ్చిన జ్ఞానంతో ఎలా తీర్పు తీర్చాడో... మీరు కూడా దేవుని జ్ఞానం కోసం అడగాలర్రా ... మీరు చదివింది గుర్తుండాలన్నా, ఎగ్జామ్స్ బాగా వ్రాయాలన్నా, ఎవరికైనా సహాయం చేయాలన్నా దేవుడు జ్ఞానం ఇస్తేనే సాధ్యం అవుతుంది. మీరు జ్ఞానవంతులైతే మీ చుట్టూ ఉన్నవారికి మీ ఫ్రెండ్స్‌కి, దేశానికి ఎంతో ఉపయోగపడతారు తెలుసా?

మరి మీరు కూడా మీ ఇంట్లో, స్కూల్లో జ్ఞానవంతులుగా ఉంటారని, రాబోయే రోజుల్లో సాల్మన్ కింగ్‌లా అందరికీ ఉపయోగపడతారని భావిస్తూ... God bless you

**– ప్రేమతో మీ అక్కయ్య**

# "నా జీవితములో దేవుని మేలులు"

- జాన్‌కళ్యాణ్, గుంటూర్ జిల్లా

దేవుని నామమునకు స్తోత్రములు, అందరికి నా వందనములు. నా పేరు జాన్‌కళ్యాణ్, మాది గుంటూర్ జిల్లా, మంగళగిరి మండలం, యర్రబాలెం గ్రామము. నేను క్రైస్తవ కుటుంబములో జన్మించాను. నాకు ఇద్దరు అక్కలు, ఒక తమ్ముడు. మేము చిన్ననాటి నుండి క్రమముగా ప్రార్థనలకు వెళ్తూ ఉండేవారము. ఈ విధంగా వెళ్తూ, ఇంటర్మీడియట్ చదువుతున్న సమయములో మారుమనస్సు పొంది, 24/04/1996వ సం॥లో బాప్తిస్మము పొందాను. తరువాత 2010వ సం॥లో ఎమ్.ఫార్మసి పూర్తి చేసుకొని, జాబ్ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చాను. అప్పుడు బి.ఫార్మసి రూమ్‌మేట్ అయిన ఒక సహోదరుడు మన పరిచర్యకు వెళ్తూ ఉండేవాడు. అతనితో పాటు రూమ్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నములు మొదలుపెట్టాను. సరియైన జాబ్ దొరకక చాలా డిప్రెషన్‌లోనికి వెళ్ళేవాడిని. నా రూమ్‌మేట్స్‌గా ఉన్న మన పరిచర్యలోని సహోదరులు కొందరు ధైర్యం చెప్తూ ఉండేవారు. వారి ద్వారా నాకు ఎపఫ్రా మినిస్ట్రీస్ పరిచయం అయ్యింది. నేను ఇంతకు ముందు అనేక సంఘములకు వెళ్ళాను కాని, మన పరిచర్యలో ఉన్న క్రమశిక్షణ, సహోదరుల ప్రేమ, అప్యాయతలు ఎక్కడా చూడలేదు. అవి నన్ను చాలా ప్రభావితం చేశాయి.

2010వ సం॥లో అనాజ్‌పూర్ మందిరములోని ఉపవాస ప్రార్థనలకు వెళ్ళాను. అక్కడ దైవసేవకులు చెప్పిన మాటల ద్వారా నా ఆత్మీయ స్థితిని పరీక్షించుకొని, నా జీవితమునకు ఆధారం ఆయనే అని నన్ను నేను పూర్తిగా దేవుని చేతులకు అప్పగించుకున్నాను. ఉపవాస ప్రార్థనలు నా ఆత్మీయ జీవితములో నేను మర్చిపోలేని విధంగా గొప్ప ప్రభావమును చూపాయి. ఆత్మీయంగా చాలా బలపడ్డాను. దైవసేవకులు, సంఘము యొక్క ప్రార్థనల ద్వారా దేవుడు 2010 డిసెంబర్ 15న ఒక మంచి ఉద్యోగమును అనుగ్రహించారు. ఈ విధంగా జరుగుచూ ఉన్నప్పుడు 2013 జనవరిలో దేవుని విశ్వసించిన అమ్మాయితో వివాహం జరిగింది. ఆ తరువాత నేను మంచి జాబ్ కోసం ప్రయత్నించుచుండగా దూరప్రాంతముల నుండి మంచి ఎమ్.ఎన్.సి కంపెనీలలో అవకాశములు వచ్చాయి. కానీ సహవాసం విడిచి వెళ్ళడం ఇష్టం లేక మరియు సహవాసములో మమ్ములను ధైర్యపరచుచున్న దైవసేవకుల వాక్యములు, సహోదరులు, సహోదరీలు చూపుచున్న ప్రేమ, చేసిన సహాయం తలచుకున్నప్పుడు వీటి కంటే ఈ జాబ్ ఎక్కువ కాదు అనిపించి కేన్సిల్ చేసుకున్నాను. హైదరాబాద్‌లోనే పరిచర్యకు దగ్గరగా దేవుడు జాబ్ ఇస్తాడు అనే విశ్వాసముతో ఉండేవాడిని.

2016 ఏప్రిల్ నెలలో నేను జాబ్ చేస్తున్న ఆర్.అండ్.డి సెంటర్ ని వేరే

రాష్ట్రమునకు మార్చాలని మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. ఇది విన్నప్పుడు నాకు చాలా భయం వేసింది. ఎందుకంటే పరిచర్యను విడిచి అంత దూరం వెళ్ళడం ఇష్టం లేదు. మరియు నేను, నా భార్య పరిచర్యలో ఆత్మీయంగా ఇప్పుడిప్పుడే బలపడుతూ వస్తున్నాము. సంఘములోని కొంతమంది సహోదరులకు నా అవసరత గురించి చెప్పి ప్రార్థించమని కోరాను. అన్నింటి ఫలితంగా దేవుడు మరల నాకు హైదరాబాద్‌లోనే ఒక మంచి కంపెనీలో జాబ్ రావడానికి కృప చూపించారు. ఒకప్పుడు గురి, గమ్యము లేని వానిగా భయంకరమైన కోపముతో మూర్ఖత్వముతో, సంకుచిత స్వభావముతో జీవిస్తున్న నేను సహవాసము లోనికి వచ్చిన తరువాత, ముఖ్యంగా ఉపవాస ప్రార్థనల ద్వారా వాటన్నింటి నుండి విడిపించబడ్డాను. సంఘ ప్రార్థనల ద్వారా దేవుడు నా భార్యకు గర్భమును తెరిచి, గర్భఫలమును అనుగ్రహించారు. ఈ విధంగా దేవుడు నా పట్ల కలిగి ఉన్న షరతులు లేని ఆయన ప్రేమను, కృపను తలంచినప్పుడు ఏమి ఇచ్చిననూ ఆయన ఋణము తీర్చలేను అని అనిపిస్తుంది.

మన ఎపఫ్రా మినిస్ట్రీస్ కి వచ్చిన తరువాత ఎపఫ్రా బ్రదర్ చెప్పే వాక్యములనుబట్టి నేను దేవునిలో ఎలా జీవించాలో, ఆత్మీయంగా లోతైన అనుభవంలోనికి ఎలా రావాలో నేర్చుకుంటూ, వాక్యాన్ని ఆధారం చేసుకొని నన్ను నేను సరిచేసుకుంటూ ఉన్నాను. ఇంకా నేను మార్పు చెందవలసింది చాలా ఉంది, దేవునిలో నేర్చుకోవలసినది ఎంతో ఉంది.

సంవత్సరములు జరుగుచూ ఉండగా దేవునికి మరింత సమీపంగా మహిమకరంగా జీవించాలని, క్రీస్తనే సంఘశరీరములో నేను ఒక అవయవంగా ఉంటూ, నాకు అప్పగించిన పనిని శక్తికి లోపం లేకుండా చేయాలని, ప్రభువును ఎరిగిన మీరందరూ నా గురించి, నా కుటుంబము గురించి ప్రార్థించమని కోరుకుంటున్నాను.



# వ్యాధులకు కారణములు

**మనుష్యులు ఎలా వ్యాధిగ్రస్తులౌతారు ?**

వ్యాధులకు, రోగాలకు కారణాలను ఇక్కడ సంక్షిప్తంగా చూద్దాం. ఆదాము పాపం చేసినప్పుడు వ్యాధిబాధలు లోకంలో ప్రవేశించాయి. అవిధేయత ఫలితంగా మానవునికి దాపురించిన శాపంలోని భాగమే వ్యాధి బాధలు. అందువల్ల ప్రత్యక్షంగానో పరోక్షంగానో వ్యాధులన్నిటికి మూల కారణం పాపమే. **"పాపము వలన వచ్చు జీతము మరణము"** (రోమా 6:23). వ్యాధి అంటే నెమ్మదిలేని స్థితి. అపరాధం చేసిన తరువాత ఆదాము మనోస్థితి, భావాలు ఇలానే ఉన్నాయి. తాను తెచ్చిపెట్టుకున్న నేరం, దోషం, తీర్పు, అవమానం అతన్ని వ్యాధుల బారిన పడేందుకు దారి తెరిచాయి. మానవ పతనం సమయం వరకు నాశనకారక క్రిములు, వ్యాధిని కలిగించే సూక్ష్మ జీవులు ఈ భూమిపై లేవు అనేందుకు తగిన కారణాలున్నాయి. దేవుడు తన సృష్టి చేసి ముగించిన తరువాత అంతా మంచిదిగా ఉన్నట్టు చూశాడు. అప్పటికే క్షయ, కలరా, స్ఫోటకం తదితర వ్యాధులను కలిగించే వైరస్‌లూ, బాక్టీరియా, కేన్సర్ మొదలైన రోగాలూ ఉన్నట్టయితే ఆయన ఇలా అనేవాడు కాదు. ఈ భయంకరమైన నాశనకారులు శాపంతోబాటు ఈ లోకంలోకి వచ్చాయి.

పాపం ఇప్పటికీ వ్యాధిని కలిగిస్తుంది. పాపమంటే స్థూలంగా దేవుని పరిపాలనను తిరస్కరించడం. అది మనల్ని దేవుని జీవం నుండి వేరు చేస్తుంది. కాబట్టి ఇలాటి ఎడబాటే అనేక వ్యాధులకు ముఖ్య కారణం. రాబోతున్న దేవుని రాజ్య ప్రత్యక్షంలో తిరుగుబాటులన్నీ అణచబడతాయి. అప్పుడిక వ్యాధులు, వేదన, మరణమూ ఉండవు. **ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు - ప్రకటన 21:4**

కొన్నిసార్లు దురాత్మలు వ్యాధులకు, బాధలకు ప్రత్యక్ష కారణాలవుతాయి. మత్తయి 9:32,33లో "దయ్యము పట్టిన మూగవానిని" మనం చూస్తాము. ఆ మూగ దయ్యాన్ని యేసు వెళ్ళగొట్టినప్పుడు ఆ మనిషి వెంటనే మాటలాడసాగాడు. అతని స్వరపేటికను ఆ మూగదయ్యం బంధించి ఉంచిందన్నది స్పష్టం. మార్కు 9:17-27లో ఒక యువకుణ్ణి యేసు దగ్గరకి తీసుకురావడం ఉంది. అతనికి కూడా మూగ దయ్యం పట్టింది. ఈ దురాత్మ అతనిలో చెవుడు, మూగతనం కలిగిస్తున్నది. ఆ చెవిటి మూగ దయ్యాన్ని యేసు వెళ్ళగొట్టాడు. ఆ యువకుడికి విడుదల దొరికింది. లూకా 13:11-16 లో "పదునెనిమిది ఏండ్ల నుండి బలహీనపరచు దయ్యము" పట్టిన ఒక స్త్రీ ఉంది. ఆమె నడుము వంగిపోయి క్రిందికి ముఖం దించుకొని ఉంది. ఈ రోజుల్లో అయితే డాక్టర్లు ఆమెకు క్రీనిక్ కర్వేచర్ ఆఫ్

స్పైన్ (వెన్నెముక వంపు తిరిగిన స్థితి) ఉందని చెబుతారు. ఆ బలహీనపరిచే దయ్యం బారినుండి యేసు ఆమెను విడిపించాడు. తనకు కలిగిన విడుదల కొరకు ఆమె దేవుణ్ణి స్తుతించింది. లేఖనాల్లో అనేక చోట్ల ఈ విధంగా వ్యక్తులు ఇలాటి వ్యాధికారక దురాత్మల పీడన కింద ఉన్న సందర్భాలు చూస్తాము. ఇలాటివారు స్వస్థపడాలంటే ఏకైక మార్గం ఏమిటంటే అధికారికమైన ఆజ్ఞతో ఆ దురాత్మను పారద్రోలడమే. దురాత్మ వెళ్ళిపోగానే వ్యాధి లక్షణాలు మాసిపోతాయి. విడిపించే ఆధ్యాత్మిక పరిచర్య మూలంగా తప్ప అలాటి వ్యక్తులకు ఆరోగ్య మనేది సమకూరదు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటం. ఆరోగ్యానికీ, వికాసానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలను మనం నిర్లక్ష్యం చేస్తే మన ఆరోగ్యం దెబ్బతింటుందన్న సత్యం నుండి మనం తప్పించుకోలేము. ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారం తీసుకుంటూ ఉండాలి. అనుదిన ఆహారంలో కొన్ని పోషక పదార్థాలూ, విటమిన్లూ తప్పక ఉండేలా చూసుకోవాలి. ఆహారంలో ఇలాటి లోపాలు, కొదువలు ఉంటే ఆరోగ్యం తప్పక పాడవుతుంది. చాలీచాలని నిద్ర, విశ్రాంతి లేకపోవడం కూడా ఆరోగ్య స్థితికి హాని చేస్తుంది. ఎక్కువ చాకిరీ చేస్తూ విశ్రాంతికీ ఉల్లాసానికి తక్కువ సమయం కేటాయిస్తూ ఉంటే అనారోగ్యం పాలుగాక తప్పదు. ముఖ్యంగా దైవ సేవకుల విషయంలో ఇది సత్యం. ఎపఫ్రొదితు  దీనికి ఒక ఉదాహరణ. అతడు మరణానికి చాలా చేరువగా వచ్చాడు. అతడా స్థితికి రావడానికి కారణం ప్రభువు సేవలో, ఆయన ప్రజల పరిచర్యలో తలకు మించిన పనిభారమే. **మరియు నా సహోదరుడును, జతపనివాడును, నాతోడి యోధుడును, మీ దూతయు, నా అవసరమునకు ఉపచరించినవాడునైన ఎపఫ్రొదితును మీ యొద్దకు పంపుట అగత్యమని అనుకొంటిని. అతడు రోగి యాయెనని మీరు వింటిరి గనుక అతడు మిమ్మునందరిని చూడ మిగుల అపేక్షగలవాడై విచారపడుచుండెను. నిజముగా అతడు రోగియై చావునకు సిద్ధమై యుండెను గాని దేవుడతనిని కనికరించెను; అతని మాత్రమే గాక నాకు దుఃఖముమీద దుఃఖము కలుగకుండుటకై నన్నును కనికరించెను. కాబట్టి మీరు అతనిని చూచి మరల సంతోషించునిమిత్తమును నా కున్న దుఃఖము తగ్గునిమిత్తమును అతనిని మరి శీఘ్రముగా పంపితిని. నా యెడల మీ ఉపచర్యలో ఉన్న కొదువను తీర్చుటకై అతడు తన ప్రాణమునైనను లక్ష్యపెట్టక క్రీస్తుయొక్క పనినిమిత్తము చావునకు సిద్ధమైయుండెను గనుక పూర్ణానందముతో ప్రభువునందు అతనిని చేర్చుకొని అట్టివారిని ఘనపరచుడి - ఫిలిప్పీ 2:25-30** బైబిల్లోని అనేక అధ్యాయాల్లో ఆహార నియమాలను గురించి ఉంది. మనకేది ఆరోగ్యకరమో, ఏది కాదో వివరాలున్నాయి (లేవి 11:1-47, ద్వితీ 14:3-21) ఈ నియమాలను పాటించమని కొత్త నిబంధన మనలను ఆదేశించడం లేదుగాని, ఆరోగ్యం కాపాడుకోవాలంటే వీటిని పాటిస్తే మంచిది (రోమా 14:2,3,14,15). తిండి విషయంలో తల మునకలవుతూ

ఉండాలని కాదుగాని మనలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాన్ని ఎంచుకుని తీసుకుంటూ ఉండాలి (హెబ్రీ 13:9)

సహజంగా పెరుగుతున్న వయసు సత్తువను నశింపజేస్తూ ఉంటుంది. యవ్వనంలో ఆ వయసుకు తగిన ఉత్తేజం ఉంటుంది. ఇది ఆరోగ్య హేతువు. బైబిల్లో యవ్వనాన్ని ఉదయకాలపు మంచుతో పోల్చారు (కీర్తన 110:3). దావీదు వేరొక చోట "పక్షిరాజు యవ్వనము వలె" యవ్వనం క్రొత్తదవుతూ ఉండడం గురించి వ్రాసాడు (కీర్తన 103:5). దీనికి అర్థం యవ్వన బలం వినూత్నమవుతూ ఉండడమని యెషయా స్పష్టం చేశాడు (యెషయా 40:31) "యౌవన కాలమున కాడి మోయుట నరునికి మేలు" అంటాడు యిర్మీయా (విలాప 3:27). కష్టించి పనిచేయాలంటే యవ్వన కాలమే తగినది. ఎందుకంటే అది శారీరక బలం ఉచ్ఛదశలో ఉండేకాలం. పైబడుతున్న వయసును సొలొమోను బహు చాతుర్యంతో వర్ణిస్తాడు. "నీ బాల్య దినముల యందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 12:2) చురుకుగా దేవుణ్ణి ప్రేమిస్తూ సేవించగలగడానికి తగిన శక్తి, ఉత్తేజం నీలో ఉన్నప్పుడే ఆయన కోసం పనిచెయ్యి. మోషే వృద్ధుడైనప్పటికి అతని కంటి చూపు, ఒంట్లో సత్తువ మందగించలేదన్న విషయం గమనించదగినది (ద్వితీ 34:7). సాధారణంగా అయితే వయసు మళ్ళుతున్న కొద్దీ జవసత్త్వాలు ఉడిగిపోతాయి, చూపు మసకబారుతుంది. అలాగైతే వృద్ధులవుతున్నకొద్దీ శారీరక స్వస్థత కలగాలని మనం ఆశించకూడదా? ఇది ఎంతమాత్రం నిజం కాదు. దేవుని వాగ్దాన మేమిటంటే "నీవు బ్రతికినన్నాళ్ళు నీకు బలం ఉంటుంది గాక !" (ద్వితీ 33:25) మన జీవిత కాలమంతటిలోనూ మంచి ఆరోగ్యాన్ని మనం అనుభవించ వచ్చునని ఈ వచనం బోధిస్తున్నదని నా అభిప్రాయం. అనేకమంది వయసు మళ్ళిన క్రైస్తవులను నేను కలుసుకున్నాను. తమలో కలుగుతున్న క్షీణతను బట్టి దేవుడు తమను పట్టించుకోవడం మానేశాడని వారి అభిప్రాయం.

కొన్నిసార్లు తాము ఏదన్నా పాపం చేశామేమోననీ, తమ శారీరక బలహీనతలు తమపైకివచ్చిన తీర్పులేమోననీ వారి ఆందోళన. చాలాసార్లు యథార్థవంతులైన క్రైస్తవులు కూడా ఈ విషయంలో చాలా మానసికమైన ఒత్తిడికి లోనవుతుంటారు. ఏదో భయంకరమైన, క్షమార్హం కాని పాపం తాము చేసి ఉంటామనుకుంటారు. అయితే క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు కూడా సమానంగా సోకే స్వాభావికమైన ముదిమికి సంబంధించిన శారీరక క్షీణత ఉంటుందని గ్రహించిన తరువాత వారికెంతో ఊరట కలిగింది. జీవిత చరమ దశలో కూడా దానికుండే ప్రత్యేకతలు దానికున్నాయి. వృద్ధాప్యాన్ని నిరసించాయి.

# సులభమైన ప్రార్థనా యొక్క శక్తి

మనుష్యులు ప్రార్థించే మార్గం, ప్రార్థించే విషయములు వారి వ్యక్తిత్వమును మరియు ఆత్మీయపరిణితిని తెలియజేస్తాయి. దేవుని వాక్యమును ప్రార్థించుట కంటే శక్తివంతమైన మార్గము లేదు. యేసుప్రభువు, పౌలు ప్రార్థించిన ప్రార్థనలను మనము గమనించినప్పుడు ఆయనకు ఏది ప్రాముఖ్యమైనదో అది మనకు చెప్తుంది.

**యేసుక్రీస్తు చేసిన కొన్ని ప్రార్థనలు :**

- తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము (లూకా 23 :34)
- సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము (పవిత్రపరచు, నీకొరకు వేరుగా నుంచు, శుద్ధిచేయు), నీ వాక్యమే సత్యము (యోహాను 17 :17)
- వారియందు నేనును నాయందు నీవును ఉండుటవలన వారు సంపూర్ణులుగా చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు, నీవు నన్ను ప్రేమించినట్టే వారిని కూడా ప్రేమించితివనియు, లోకము తెలిసికొనునట్లు... (యోహాను 17 :23)
- నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీ కొరకు వేడుకొంటిని (లూకా 22 :32)
- తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను (యోహాను 11 :41)

**పౌలు చేసిన కొన్ని ప్రార్థనలు చూద్ధాము :**

పౌలు ఎఫెసీ, ఫిలిప్పీ మరియు కొలస్సీయులకు వ్రాసిన పత్రికలలో అతని ప్రార్థనలను చూచినప్పుడు అవి ఎంతో ప్రభావవంతంగా ఉంటాయి. పౌలు ఎప్పుడూ ప్రజలు సులువైన జీవితములు కలిగి ఉండాలని లేక కష్టాల నుండి విడుదల పొందాలని ప్రార్థించలేదు. దానికి బదులుగా ప్రజలు తమ మార్గములో ఏది వచ్చినప్పటికీ భరించే శక్తిగల వారగుటకు, ఆత్మలో నడుచునట్లు, స్థిరంగా ఉండుటకు, దేవుని కృపకు ఉదాహరణలుగా ఇతరులకు కనిపించాలని ప్రార్థించాడు. అతను దేవునికి ప్రాముఖ్యమైన విషయాలను గురించి ప్రార్థించాడు. మరియు ఈ విధంగా ప్రార్థించినప్పుడు దేవుడు అసామాన్యమైన శక్తిని విడుదల చేస్తారు.

ఎఫెసీ 1:17 నందు పౌలు.. మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దేవుడైన, మహిమ స్వరూపియగు తండ్రి తన్ను తెలిసికొనుటయందు మీకు జ్ఞానమును ప్రత్యక్షతయును గల

మనస్సు అనుగ్రహించునట్లు, నేను నా ప్రార్థనలయందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను.” అని చెప్తున్నాడు. ఈ ఉదాహరణను అనుసరిస్తూ, మనము కూడా జ్ఞానము, ప్రత్యక్షత గల మనస్సు కొరకు ప్రార్థించవలసియున్నది, అది మన మొదటి విజ్ఞాపన అయి ఉండవలెను. నిజానికి, ప్రత్యక్షత కొరకు – ఆత్మీయ పరిజ్ఞానము మరియు గ్రహింపుల కొరకు దేవుని అడుగుట అనునది మనము ప్రార్థించగలిగిన ప్రాముఖ్యమైన ప్రార్థన. ప్రత్యక్షత అనగా “తెర తీయుట” మరియు, క్రీస్తులో మనకు చెందిన ప్రతిదానిని తెరతీయమని మనము దేవుని అడుగవలసియున్నది. మనకొరకు, ఇతరులకొరకు ఎలా ప్రార్థించవలెనో మనం తెలుసుకొనునట్లుగా వాక్యంలోని సత్యాలను మనకు ప్రత్యక్షపరచమని ఆయనను అడుగవలసియున్నది. ఎవరైనా మనకు బైబిలు నియమము లేక ఒక ఆత్మీయ సత్యమును చెప్పినప్పుడు, అది “సమాచారము”. కాని, దానిని అర్థంచేసుకొనుటకు దేవుడు మనకు సహాయం చేసినపుడు, అది ప్రకటన అవుతుంది – మరియు ప్రకటనను మనవద్దనుండి భూమి పైని ఏ మానవుడు, నరకంలోని ఏ అపవిత్రాత్మ తీసికొనిపోలేదు. ప్రత్యక్షత ప్రకటన, ఎందుకంటే, దానిని దేవుడు మనకు ఇచ్చాడు.

“ఆయనను గూర్చిన జ్ఞానములో” ఆత్మీయ మర్మాలలో మనకు పరిజ్ఞానము అనుగ్రహించవలెనని దేవుని నిరంతరంగా అడుగవలసియున్నదని, ఈ వచనం చివరలో చెప్పబడింది. ఎఫెసీ 1:18లో పౌలు ఇంకా చెబుతూ “మరియు మీ “మనోనేత్రములు” (మనం మనస్సు అనుకుందాము) వెలిగింపబడినందున, కాబట్టి ఆయన మిమ్మును పిలిచిన పిలుపువల్లనైన నిరీక్షణ యెట్టిదో, పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యమెట్టిదో.... మీరు తెలుసుకొనవలెనని ప్రార్థిస్తున్నాను” అని అంటున్నాడు.

ఎఫెసీ 3:16 నందు పౌలు **“మీరు అంతరంగ పురుషుని యందు శక్తి కలిగి ఆయన ఆత్మ వలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించు నట్లుగానూ తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయ చేయవలెననియు....”** అని పౌలు ప్రార్థిస్తున్నాడు. ఈ ప్రార్థనను మనము క్రమముగా చేయవలసియున్నది. మనము దేవా, నా అంతరంగ పురుషునిలో శక్తిని బలమును దయచేసి, నాలోను నా ప్రవర్తన ద్వారాను పరిశుద్ధాత్ముడు నాలో నివసింపనివ్వు. ఇటువంటి ప్రార్థన మనలను రూపాంతరపరుస్తుంది. మన జీవితాలలో మరి దేనికీ చోటులేకుండునట్లుగా మనము దేవునితో నింపబడవలెనని ప్రార్థించవలసియున్నది.

# కైలాస మహర్షి

**(గత సంచిక తరువాయి భాగం)**

“నేను సుమారు 438 సంవత్సరములకు పూర్వం ఈజిప్ట్ దేశానికి చెందిన అలెగ్జాండ్రియా పట్టణంలో ఒక మహమ్మదీయ కుటుంబంలో జన్మించాను. నా బంధువులు బహు మతాసక్తిగలవారైనందున, నన్ను నిష్టగల, నిజమైన మహమ్మదీయునిగా చేయడానికి తగిన ఉపదేశమిచ్చారు. నేను ప్రతిరోజు నమాజు చేయడంలోను, ఖురాను చదవడంలోను సమయం గడిపేవాడను. అయినా నా ఆధ్యాత్మిక తృష్ణతీరలేదు. నాకు మనశ్శాంతి కరువైంది. ఆత్మశాంతికై కఠినమైన వైరాగ్య జీవితాన్ని అవలంబించాను. ముప్పదేండ్ల వయస్సు నిండక ముందే ఫకీరునై ఒక మఠంలో ఏకాంతముగా ధ్యానము, జాగరణ చేయడానికి శ్రద్ధవహించాను. తద్వారా ఆత్మరక్షణ పొందడానికి ప్రయాసపడ్డాను. కాని నా కోరిక తీరనందున, నిరాశచెంది ఆత్మహత్య చేసుకోవడమే మేలని భావించాను.

నేనీ సంకటావస్థలో నుండగా ఒక క్రైస్తవ సాధువు ఇండియా నుండి వచ్చాడని, ఆయన నిజమైన రక్షకుని గురించి బోధిస్తున్నాడని విని ఆయనను చూడ నాశించాను. అనుకొనని విధంగా ఆ సాధువే నా దగ్గరకు వచ్చి, నీ ఆత్మస్థితి ఎట్లున్నదని ప్రశ్నించాడు. నా పరిస్థితి నంతటినీ వివరించగా, ఆయన నన్ను తేరిచూచి “నీ ఆత్మ వేదనకు గల కారణము నేనెరుగుదును. కలవరపూరితమైన నీ ఆత్మకు శాంతి, ఆదరణనిచ్చే ఒకని గూర్చి నీకు చెబుతాను” అని తన యొద్దనున్న చిన్న పుస్తకము తెరచి **“ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా, నాయొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును.” “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుడుగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక, నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను”** మొదలగు వాక్యములను చదివి వాటి భావమును వివరించారు. ఆదరణపూరితమైన ఆ వాక్యములను వినగా నా ఆత్మకు నిరీక్షణ, నెమ్మది కలిగింది. కొన్ని దినములు ఆయనను దర్శిస్తూ, ఆయన చెంత అనేక ఆధ్యాత్మిక జీవిత రహస్యాలను తెలిసికొంటూ గడిపాను. యేసుక్రీస్తు నందున్న విమోచనా శక్తిని గ్రహించి, ఆయనను స్వరక్షకునిగా అంగీకరించినంతనే ఆత్మశాంతిని పొందగలిగాను. అంతట ఆ బోధకునిచే బాప్తిస్మము పొంది క్రైస్తవుడనయ్యాను.

నేను క్రైస్తవానుభవమును పొందిన నాటనుండి ఇతరులకు కూడా ఈ రక్షణ మార్గమును వివరించవలెనన్న ఆశనాలో అధికమయింది. మీతోకూడ నన్ను రానిమ్మని సాధువునుకోరి ఆయన సహవాసములో కొన్ని మాసములు గడిపాను. ఆ బోధకుడు ఈజిప్ట్



మీ శత్రువుకోసం రాజేసిన నిప్పు శత్రువును కాదు, తరచుగా నిన్నే కాలుస్తుంది.

దేశమును విడిచి వెళ్ళుతూ నీవు లోకమంతట సంచరించి, రక్షణ సువార్తను ప్రకటించమని నాకాజ్ఞాపించాడు. ఆయన చెప్పిన మాటలకు లోబడి ప్రపంచ పర్యటన ప్రారంభించాను. ఆ సాధువుపేరు జెర్నాస్. ఆయన ఫ్రాన్సిస్ జేవియర్ మేనల్లుడు నేనింతకుముందు చదివిన నూతన నిబంధన ఆయన ఇచ్చిందే. అది ఫ్రాన్సిస్ జేవియర్ మరణానంతరం జెర్నాస్ గారికి లభించగా, అదినాకు బహుకరించబడింది. నేను 70సం॥లు అంటే నాకు 105 సం॥ల ప్రాయము వచ్చువరకు ప్రపంచ పర్యటన సాగించి సువార్త ప్రకటించాను. నాకు 21 భాషలలో ప్రవేశం ఉంది. అందు మీ హిందుస్థానీ ఒకటి.

నాకు 105 సం॥ల ప్రాయము రాగానే నా దేహబలము, మనోబలము క్షీణించడం గమనించి ఈ స్థలాన్ని ధ్యానం కోసం ఎన్నుకున్నాను. ఇది ప్రశాంత ప్రాంతము, చాలామైళ్ళ వరకు మనుష్య నివాసములులేవు. ఈతావు అతిశీతలమైనందున ఎవరూ ఇచ్చటికిరారు. ఇచ్చటి ప్రకృతి అతిమనోహరమైనది. భూమి సారవంతమైనది. ఈ అరణ్యములో ఆయా మూలికలు ఫలములు లభిస్తాయి. అహోరాత్రులు మంచుకురిసే శీతాకాలంలో మిగుల ఉష్ణమును కలిగించు ఒక మూలికను సేవిస్తాను. ఇచ్చట లభించే ఆకులు ఆరోగ్యమును, దీర్ఘాయువును కలిగిస్తాయి. అడవి మృగాలు నాతో కలసి ఉంటాయి. నేను ఈ విధంగా ఇక్కడ జీవిస్తూ విశ్వాసుల కొరకు విజ్ఞాపన చేస్తూ శేష జీవితం గడుపుతున్నాను.


**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com




# బైబిల్ క్విజ్ -48

**(ఎజ్రా)**

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** మందిర నిర్మాణాన్ని ఆపిందెవరు?

**2.** దేవుని ధర్మశాస్త్రమందు శాస్త్రియు, యాజకుడు ఎవరు?

**3.** ఏ నది దగ్గర ఎజ్రా, అతని స్నేహితులు ఉపవాసం చేశారు?

**4.** యెహోవా మందిరాన్ని నిర్మించడానికి ఏ పారసీక దేశపురాజు మనస్సును యెహోవా ప్రేరేపించాడు?

**5.** సురక్షితమైన శుభప్రయాణం కోసం ఉపవాసాన్ని ప్రకటించినదెవరు?

**6.** దేవుని మందిరపు పునాదిని వేయించినదెవరు?

**7.** యెరూషలేములో నుండి మందిర ఉపకరణములను తీసుకొని వచ్చింది ఎవరు?

**8.** తన తల వెంద్రుకలను, గడ్డపు వెంట్రుకలను పెరికి వేసుకొని విభ్రాంతితో కూర్చున్నదెవరు?

**9.** యాజకుడైన ఎజ్రా అడిగినవన్ని సమకూర్చమని ఏ రాజు ఆదేశించాడు?

**10.** కోరెషురాజు ఖజానాదారుడు ఎవరు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు అక్టోబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ 2016 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్ ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్-47 జవాబులు (దినవృత్తాంతములు నుండి ఇవ్వబడినవి :**

1.కోరేషు (2 దినవృ 36:22)
2.ఆసాపు (1 దినవృ 16:5)
3.ఆహాజు రాజు (2 దినవృ 28:22)
4.సౌలు (1 దినవృ 10:13)
5.దినవృత్తాంతాల మొదటి గ్రంథం (1:1)
6.అతల్యా (2 దినవృ 22:3)
7.యబ్బేజు, అబీషై (1 దినవృ 4:9, 11:20)
8.ఆసా (2 దినవృ 16:12)
9. నిమ్రోదు (1 దినవృ 1:10)
10. యెహోరాము (2 దినవృ 21:18)

**బైబిల్‌క్విజ్-47 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:**

షీబా, సుశీల, సౌజన్య, ఐజాక్ కుమారి.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత:** వాసుదేవరావు, సందీప్, శ్రేయస్, కవిత,సుజాత, టైటస్, ఇందిరాప్రియ, ఇస్సాకు, కృష్ణబాలాజి, జ్యోతి, ప్రియాంక, జయశ్రీ, ప్రసాద్, పుష్పలత, శ్రీలక్ష్మి, సుధావల్లి, ఒలీవషారోన్, కిరణ్‌కుమార్, షాలేం, ప్రసన్నకుమార్, బ్యూలా, మాధురి, చంద్రవర్మ, హెప్సిబా, ప్రేమ్‌కుమార్, జోసెఫ్‌స్పర్జన్, యోసేపు, గ్లాడీ, దీవెన, చెన్నకేశవరెడ్డి, సుకుమార్, సాయికుమార్, నవ్య, దివ్యదీపిక, స్వరూప్, అరుణ, ఎపఫ్రా, రిక్విన్‌రాజ్, పద్మశ్రీ, సలోమి, హోసన్న, రాణి, శేఖర్, ప్రజ్ఞ, రిత్వికేష్, ఉదయశ్రీ, విజయ్‌కుమార్, విజయకుమారి, అనిత, రామలక్ష్మి, అన్నపూర్ణ, నిర్మల్, రామకృష్ణ, సుష్మ, సైమన్, సృజన్, లక్ష్మి, కీర్తి, శిరీష, వెంకటరాములు, వనిత, ప్రత్యూష, నిర్మల, గౌతమి, షైనీజ్యోతి, ఉషారాణి, విజయ, సాల్మన్‌రాజ్, ఫిలిప్, మాధవి, ప్రసన్నరాణి, నవీన్‌కుమార్, అభిజ్ఞ, స్రవంతి, హర్షిత, సుహాసిని,శ్యామ్, పూర్ణజ్యోతి, సాహిత్, సాల్మన్‌రాజ్, శామ్సన్, యేసుబాబు, ప్రగతి, మేరి, ఆదిలక్ష్మి, జ్యోత్స్న, దీపిక, మనీష్‌బాబు, విజయ్‌రాజు, సత్యనారాయణ, షారోన్, త్రివేణి, ప్రియదర్శిని, చంద్రకళ, విజయలక్ష్మి, శ్రీధర్, నిస్వార్థ్, సాయికస్తూరి, ప్రదీప్‌కుమార్, ప్రణీత్‌కుమార్, మల్లేశ్వరి, సూర్యరాజు, రవికుమార్(మిర్యాలగూడ)

**చింతల్:** కృష్ణవేణి, సుధాకర్, సోనురాజ్, ప్రసాద్, శ్యామ్‌శేఖర్, కళ్యాణ్, ఎఫ్రాయిము, రాజేష్, రాజు, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, జయమ్మ, త్రిమూర్తులు, భవాని, నరేంద్ర, ప్రమీల, దుర్గాప్రసాద్, వేణుకుమారి, శ్రీహర్షవర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, సాగర్, విశేష

**అనాజ్‌పూర్:** వరప్రసాద్, శ్యామ్‌కుమార్, వివేక్, లాస్య, జాన్సన్, కళ్యాణ్‌కుమార్, రజిత, రవీంద్ర, రామారావు, అక్షర, సుష్మ, మమత, విజయ్

**ఇ.సి.ఐ.ఎల్:** సుజని

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

2016, ఆగస్టు 15వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో
అనేకులు పాల్గొని దేశం కొరకు ప్రార్థించడం జరిగినది.





2016, ఆగష్టు 15వ తేది ఉపవాస ప్రార్థనలో జరిగిన
జెండా వందన కార్యక్రమములో పాల్గొనిన విశ్వాసులు.










# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras